సాక్షి
మహబూబాబాద్
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



వ్యాపారాభివృద్ధి మరింత సాధించాలి

వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మరింత అభివృద్ధి సాధించాలని నాబార్డ్ జనరల్ మేనేజర్ హరగోపాల్ అన్నారు. - 8లో ▸



అరుదైన అవకాశం..

నూతన పార్లమెంట్ భవనంలో అక్టోబర్ 2న నిర్వహించే శ్రద్ధాంజలి కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన ప్రతిమ పాల్గొననుంది. - 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0^0 / 30.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజల మనిషి కొండా లక్ష్మణ్



మహబూబాబాద్ రూరల్: ప్రజల మనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎస్పీ చంద్రమోహన్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాను బాధ్యతగా పరిశీలించాలి

మహబూబాబాద్: ఓటరు జాబితాను ఎన్నికల అధికారులు బాధ్యతగా పరిశీలించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాల మాయాదేవి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓటరు జాబితా నివేదికను రూపొందిస్తున్న తీరును జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక ఆధ్వర్యంలో బాల మాయాదేవి సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల తొలగింపు విషయంలో మరింత జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మహబూబాబాద్ రూరల్: తెలంగాణలో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక మాజీ మంత్రి, కాంగ్రెస్ మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పరమేశ్వర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌నాయక్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులను సంసిద్ధం చేయడం కోసమే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మానుకోట ఎమ్మెల్యే టికెట్ కోసం 8మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎవరికి టికెట్ ఇవ్వాలనే అంశాన్ని అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. పదేళ్లుగా మానుకోటలో కాంగ్రెస్ గెలవలేదన్నారు. ఈసారి ప్రజలందరూ సహకరించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. సర్వేలు, నివేదికలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రజల ఓట్లతో గెలిచి, తన సంపాదన కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. భూకబ్జాలు, అవినీతి, అక్రమాలు ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, ఎల్‌డీఎం కోఆర్డినేటర్ శ్రీనివాస్, నాయకులు ఉదయ్‌చందర్, మురళీనాయక్, దస్రూనాయక్, రమేష్, రామరాజు, వెంకన్న, నాగేశ్వర్‌రావు, సతీష్, ప్రభాకర్, సాంబయ్య, విజయలక్ష్మి, కౌన్సిలర్లు రాజు, శ్రీనివాస్, నాగలక్ష్మి శ్రీను పాల్గొన్నారు.

వీరన్న హుండీ ఆదాయం రూ.24.31లక్షలు

కురవి:మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి హుండీ ఆదాయం రూ.24,31,293 వచ్చినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆలయ మండపంలో హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ మహబూబాబాద్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత సమక్షంలో లెక్కించారు. వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.18,37,720, భద్రకాళీ హుండీ ద్వారా రూ.5,93,573 వచ్చినట్లు ఆయన వివరించారు.

అవగాహన పెంచుకోవాలి

నెల్లికుదురు: వివిధ రకాల పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంచుకుని మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డీఏఓ ఛత్రునాయక్ అన్నారు. బుధవారం మండలంలో సాగు చేసిన మిరప, పసుపు వివిధ పంటలను క్షేత్రస్థాయిలో ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, రైతులతో కలిసి ఛత్రునాయక్ పరిశీలించారు. పంటలకు సోకే చీడపీడలపై అవగాహన కల్పించారు. అనంతరం వానాకాలం పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆరా తీసి రైతులు పంట సాగుకు మొగ్గు చూపేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

బై బై గణేశా..

వచ్చే ఏడాది కలుద్దామంటూ భక్తుల వీడ్కోలు

- జిల్లాలో 1,618 వినాయక విగ్రహాల నిమజ్జనం
- పోలీసుల భారీ బందోబస్తు



భారీ క్రేన్ సాయంతో గణేశుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



మహబూబాబాద్ అర్బన్: ఊరూరా తొమ్మిదిరోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,618 విగ్రహాలను ఏర్పాటు చేయగా.. అన్నింటిని చెరువులు, కుంటలు, వాగులు, కాల్వలు ఇతర జలాశయాల్లో నిమజ్జనం చేశారు. వచ్చే ఏడాది మళ్లీ కలుద్దాం వినాయక అంటూ భక్తులు లంబోదరుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

డప్పు వాయిద్యాల మధ్య..

డప్పు వాయిద్యాల మధ్య వినాయక విగ్రహాల శోభాయాత్ర సాగింది. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువులో గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఫారెస్టు కార్యాలయం సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద ఎంపీ మాలోత్ కవిత, ఎస్పీ జి.చంద్రమోహన్, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి దంపతులు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులకు పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

భారీ బందోబస్తు..

నిమజ్జనంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 70 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. నిజాం చెరువు వద్ద మున్సిపల్ అధికారులు, పోలీసులు మూడు భారీ క్రేన్లను ఏర్పాటు చేసి గణనాథులను నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా లడ్డూ వేలం..

జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరం రోడ్డులో కౌన్సిలర్ గుండా స్వప్న రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి సన్నిధిలో ఉత్సవ నిర్వాహకులు లడ్డూవేలం పాట నిర్వహించగా ఆర్ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రావణ్ రూ.1,71,000లకు దక్కించుకున్నాడు. చిన్న లడ్డూను కందగట్ల శేఖర్ అనే భక్తుడు రూ.46,116లకు సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్లు, అధికారులు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

- మరిన్ని ఫొటోలు 9లో ▸



నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్, కమిషనర్



నిజాం చెరువులో గణనాథుడి నిమజ్జనం



గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



నిజమ్జనంలో పాల్గొన్న ఎస్పీ చంద్రమోహన్



వినాయక శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్

- మంత్రి సత్యవతిరాథోడ్



నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

మహబూబాబాద్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. కలెక్టరేట్‌లోని మంత్రి చాంబర్‌లో బుధవారం కొండాలక్ష్మణ్ జయంతి కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ గర్వించే బిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ మహోద్యమంలో ఆయన పాత్ర వెలకట్టలేదనిదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. పదవులు శాశ్వతం కాదని, తెలంగాణ ఆవిర్భావమే ముఖ్యమని, భావితరం గొప్పగా బతకాలని తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న గొప్ప వ్యక్తి లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. మలిదశ ఉద్యమంలో కూడా పాల్గొన్నారన్నారు. అక్టోబర్ 1న వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మానుకోటలో పర్యటిస్తారని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కలెక్టర్ శశాంక, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి నర్సింహస్వామి ఉన్నారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేడు(గురువారం) మరిపెడకు రానున్నట్లు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. బుధవారం మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంత్రి వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతారని చెప్పారు. నియోజకవర్గం నుంచి 50వేలకు తగ్గకుండా జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శంకుస్థాపన వద్ద, బహిరంగ సభస్థలిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, రామడుగు అచ్యుతరావు, గుగులోతు రాంబాబు, వెంకన్న తదితరులు ఉన్నారు.

డయాలసిస్ తిప్పలు

రోగులు ఎక్కువ.. బెడ్స్ తక్కువ

- పక్క జిల్లాలకు వెళ్తున్న కిడ్నీ రోగులు
- జిల్లా ఆస్పత్రిలో పడకల సంఖ్య పెంచాలని వేడుకోలు
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కనికరించాలని విన్నపం



మహబూబాబాద్‌లోని డయాలసిస్ సెంటర్

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో కిడ్నీ రోగులందరికీ డయాలసిస్ సేవలు అందడం లేదు. బెడ్లు తక్కువ.. రోగులు ఎక్కువగా రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలో రోగులు ఇతర జిల్లాలకు వెళ్లడం లేదా వేలకు వేలు ఖర్చుచేసి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నేడు మరిపెడలో మంజూరైన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లాలో డయాలసిస్ సెంటర్లు పెంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రోగులు ఎక్కువ.. బెడ్లు తక్కువ

వైద్యారోగ్యశాఖతో పాటు ఇతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వేల్లో జిల్లాలో కిడ్నీ, కాలేయ వ్యాధితో బాధపడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వేల సంఖ్యలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్నవారు ఉన్నారు. కాగా కిడ్నీలు దెబ్బతిని బాధపడుతున్న వారు జిల్లాలో 570 పైగా ఉంటారని అంచనా. వీరికి రోజు విడిచి రోజు లేదా రెండు రోజులకోసారి డయాలసిస్ చేయాలి. అయితే జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో కేవలం ఐదు బెడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో అందరికీ డయాలసిస్ సేవలు అందడం లేదు.

పడకలు పెంచితేనే..

ఆస్పత్రిలో సరిపడా బెడ్స్ పెంచితేనే రోగుల కష్టాలు తీరుతాయి. బెడ్లు తక్కువగా ఉండడంతో జిల్లాలోని తొర్రూరు, మరిపెడ, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాలకు చెందిన వారు వరంగల్, హనుమకొండ పట్టణాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. అదేవిధంగా మరిపెడ ప్రాంతం వారు ఖమ్మం వెళ్తున్నారు. దీంతో రోగులపై ఆర్థిక భారం పడుతోంది. కాగా జిల్లా ఆస్పత్రిలో బెడ్స్ పెంచడంతో పాటు గూడూరు, గార్ల సీహెచ్‌సీలు, నూతనంగా వంద పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ అయిన తొర్రూరు, మరిపెడ పట్టణాల్లో కొత్త డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పడకలు పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. సేవలు బాగానే ఉన్నాయి. అయితే బెడ్స్ తక్కువగా ఉండడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. బెడ్స్ పెంచాలి.

- బాదావత్ బాషా, చిన్నగూడూరు

డయాలసిస్ సెంటర్లు పెంచాలి



ప్రస్తుతం ఉన్న డయాలసిస్ సెంటర్‌లో ఐదు బెడ్స్ మాత్రమే ఉన్నాయి. ఇందులో పాతవారికే సేవలు అందుతున్నాయి. బాధితులు పెరిగారు. ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడివారు అక్కడే డయాలసిస్ చేయించుకునే విధంగా గార్ల, గూడూరు, తొర్రూరు, మరిపెడ ప్రాంతాల్లో సెంటర్లు ఏర్పాటు చేయాలి.

- రవిరాజ, మహబూబాబాద్

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం



జిల్లాలో డయాలసిస్ అవసరమైన పేషంట్లు ఎక్కువగానే ఉన్నారు. వీరికి సరిపడా బెడ్స్ లేవు. ఉన్న బెడ్స్‌తో సెంటర్ నడుపుతున్నాం. మహబూబాబాద్‌లో అదనపు బెడ్స్, కొత్త సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. మంత్రి హరీశ్‌రావు దృష్టికి కూడా తీసుకెళ్తాం.

- శ్రీనివాస్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

అమాత్యా.. రిజర్వాయర్ హామీ ఏమైంది?

- ఆరేళ్లు దాటినా అమలు కాని మంత్రి హరీశ్‌రావు రిజర్వాయర్ హామీ
- నేడు మంత్రి మరిపెడకు రాక





కురవి చెరువును పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు(ఫైల్), రిజర్వాయర్ చేయాల్సిన కురవి పెద్ద చెరువు

కురవి: అమాత్యా.. ఆరేళ్ల క్రితం ఇచ్చిన రిజర్వాయర్ హామీ ఏమైందని కురవితో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు అడుగుతూ మరోమారు గుర్తు చేస్తున్నారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు 2017 జూన్ 8న కురవి మండలంలో పర్యటించారు. ఆ సమయంలో కురవి పెద్ద చెరువును పరిశీలించారు. అక్కడే గౌడ కులస్తులు ఏర్పాటు చేసుకున్న కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఈ మేరకు కురవి పెద్ద చెరువును పరిశీలించి రిజర్వాయర్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎమ్మెల్సీలు పల్లారాజేశ్వర్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మానుకోట ఎంపీ మాలోత్ కవిత సమక్షంలో ఆయన ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. నేడు (గురువారం) మరిపెడ మండల కేంద్రంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి హరీశ్‌రావు వస్తున్నారు. ఆయన రాక సందర్భంగా కురవి పెద్ద చెరువును రిజర్వాయర్ చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని స్థానిక రైతులు, ప్రజలు గుర్తు చేస్తున్నారు.

రిజర్వాయర్‌తో సస్యశ్యామలం..

కురవి పెద్ద చెరువు సుమారు 320 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువు కింద వందల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువును రిజర్వాయర్ చేస్తే ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది. చెరువు కిందిభాగంలో ముత్యాలమ్మ చెరువు ఉంది. కాగా రిజర్వాయర్ చేస్తే రెండు చెరువులు కింద పంటలకు నీటి కరువు ఉండదు. కురవి, తిర్మలాపురం, నల్లెల్ల, బలపాల, ఆయా గ్రామాల్లోని కుంటలు, డోర్నకల్ మండలంలోని చిలుకోడు, వెన్నారం వరకు ఉండే చెరువుల్లోకి నీరు వెళ్లే అవకాశం ఉంది.

పర్యాటకంగా అభివృద్ధి..

మండల కేంద్రంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ఉంది. ఆలయానికి లక్షల మంది భక్తజనం వస్తుంటారు. చెరువును రిజర్వాయర్ చేస్తే పర్యాటకంగా సైతం అభివృద్ధి చెందుతుంది. ఎమ్మెల్యే రెడ్యానాయక్ సైతం మంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సేవలతోనే గుర్తింపు: కలెక్టర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

మహబూబాబాద్: తపాలాశాఖ సేవలను విస్తరించి, ప్రజలకు అందుబాటులో ఉంటేనే గుర్తింపు వస్తుందని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టల్‌శాఖ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను కలెక్టర్ ప్రారంభించి, అనంతరం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంలో తపాలాశాఖ ఒక భాగమని అన్నారు. జిల్లాలోని 1,17,000 మంది లబ్ధిదారులకు ఆసరా ఫించన్లు అందిస్తుందన్నారు. ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తూ ఉత్తమ సేవలందిస్తుందన్నారు. తపాలాశాఖలో ఉత్తమ సేవలందించిన ఐదుగురు ఉద్యోగులకు మెమెంటోలు అందించి అభినందించారు. సమావేశంలో పోస్టల్‌శాఖ వరంగల్ అధికారి నర్సింహస్వామి, సైదానాయక్, సంపత్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి పర్యాటక రంగం

పర్యాటక ప్రాంతాల సందర్శనతో మానసికోల్లాసం కలుగుతుందని, ఆరోగ్యపరంగా ఉత్తేజితులను చేస్తుందని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ, జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యాటక రంగంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి కలెక్టర్ మాట్లాడారు.

ఒకరికి డెంగీ.. తండాలో సర్వే

డోర్నకల్: మంలంలోని మల్లాయికుంటతండాలో ఒకరు డెంగి బారిన పడినట్లు డోర్నకల్ వైద్య సిబ్బంది నిర్ధారించారు. తండాలో జ్వరంతో బాధపడుతున్న ఒకరికి వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీగా నిర్ధారణ కావడంతో అప్రతమత్తమయ్యారు. తండాలో వైద్య సిబ్బంది 40 ఇళ్లలో సర్వే నిర్వహించారు. జీపీ సిబ్బంది శానిటేషన్ పనులు చేపట్టారు.

ఉద్యమ బాట వీడని యోధుడు 'కొండా'

- టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ గోపాల్‌రావు
- కొండా లక్ష్మణ్‌ బాపూజీకి ఘన నివాళి



కొండా లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

హన్మకొండ: పుట్టిన గడ్డ విముక్తి కోసం సాయుధ పోరాటంలోకి దూకిన స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌ బాపూజీ.. కడవరకు తెలంగాణ ఉద్యమ బాట వీడలేదని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. కొండా లక్ష్మణ్‌ బాపూజీ జయంతిని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో ముందుగా ఆయన చిత్రపటానికి సీఎండీ, డైరెక్టర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ ఆసిఫాబాద్‌ జిల్లా వాంకిడిలో జన్మించిన కొండా లక్ష్మణ్‌ బాపూజీ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొని క్విట్‌ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. నిజాం కాలంలో తెలంగాణ విముక్తికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఊపిరిగా, నిస్వార్థంగా గాంధేయ మార్గంలో పయనించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ బి.జనార్దన్‌, సీజీఎంలు, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైస్‌ మిల్లులో రేషన్‌ బియ్యం దందా

నెల్లికుదురు : మండలంలోని మునిగలవీడులోని వెంకటేశ్వర రైస్‌ మిల్లులో రేషన్‌ బియ్యం దందాను పోలీసులు ఛేదించారు. ఎస్సై కె.క్రాంతికిరణ్‌ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మాశెట్టి వెంకన్న గ్రామాల్లో అక్రమంగా రేషన్‌ బియ్యం సేకరించి వెంకటేశ్వర రైస్‌ మిల్లులో డంపు చేస్తున్నాడు. వాటిని పాలీష్‌ చేసి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆ రైస్‌ మిల్లులో సన్నబియ్యం కొనుగోలు చేసిన ఓ వ్యక్తి డయల్‌ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సోదా చేశారు. పాలీష్‌ చేసిన 287 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భౌబోయ్‌..

గ్రేటర్‌'లో రోజురోజుకూ పెరుగుతున్న శునకాల బెడద

- పొంచివున్న 'రేబిస్‌'.. ప్రమాదకరంగా కుక్కకాటు..
- హెచ్చరిస్తున్న ఐసీఎంఆర్‌, ఎయిమ్స్‌ సర్వేలు
- ఏటా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నామంటున్న అధికారులు
- కుక్కకాటు సంభవించినప్పుడే స్పందిస్తున్న పాలకులు
- అప్రమత్తత లేకుంటే భవిష్యత్‌లో ప్రమాదమే..
- నేడు ప్రపంచ రేబిస్‌ డే



వరంగల్‌ నగరంలో సంచరిస్తున్న కుక్కలు (ఫైల్‌)

సాక్షిప్రతినిధి, వరంగల్‌:

- కాజీపేట రైల్వే కాలనీలోని చిల్డ్రన్‌ పార్క్‌ సమీపంలో ఉత్తర్‌ప్రదేశ్‌ బెనారస్‌కు చెందిన ఏడేళ్ల బాలుడు చోటూను కుక్కలు కరిచి చంపాయి. బొమ్మలు, ఉంగరాలు అమ్ముకుంటూ పొట్ట పోసుకునే వలస కుటుంబంలో కుక్కకాటు విషాదం నింపింది.
- హనుమకొండ సమ్మయ్యనగర్‌ ఏరియాలో ఒకే రోజు ఏడుగురు కుక్కకాటుకు గురయ్యారు. రెడ్డి కాలనీలో 16 మందిని కరిచాయి. హనుమాన్‌నగర్‌, ప్రశాంత్‌నగర్‌లో రెండు నెలల క్రితం ఐదుగురు చిన్నారులను కుక్కలు కరిచిన ఘటన పలువురిని భయభ్రాంతులకు గురిచేసింది. ఇప్పటికీ ఒక్కరు బయటకు వెళ్లలేని పరిస్థితి.
- వరంగల్‌ 39వ డివిజన్‌ లక్ష్మీనగర్‌లో రెండు నెలల క్రితం ఇంటిముందే ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్కల దాడి చేశాయి. అటుగా వెళ్తున్న వారు కర్రతో బెదిరించడంతో ఆ బాలుడు ప్రాణంతో బయటపడ్డాడు. విద్యానగర్‌ కాలనీ, కాశికుంటలో 15 రోజుల క్రితం మూత్ర విసర్జనకు వెళ్లిన వృద్ధుడిపై వీధికుక్కలు దాడి చేయడంతో అతడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు.

.. ఇలా గ్రేటర్‌ వరంగల్‌లో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కుక్కకాటు గాయాలు, మరణాలు సంభవించినప్పుడు మాత్రమే చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం వాటి నియంత్రణను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆగని కుక్కకాట్లు.. వెంటాడుతున్న రేబిస్‌..

'దేశంలో రెండు సెకన్లకు ఒకరు కుక్క కాటుకు గురవుతుండగా.. వారిలో అరగంటకొకరు మృతి చెందుతున్నారని' ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ మెడికల్‌ రీసెర్చ్‌, ఢిల్లీ ఎయిమ్స్‌ సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనం తేల్చింది. కుక్కకాటు, ఇతర జంతువుల కాటు వల్ల వచ్చే రేబిస్‌ కారణంగా ప్రతి సంవత్సరం 18వేల నుంచి 20వేల మంది మరణిస్తున్నారు. దేశంలో 93శాతం రేబిస్‌ మరణాలు కుక్క కాటుతోనే సంభవిస్తున్నాయని అధ్యయనంలో తేలింది. ఇందులో 63శాతం మరణాలు వీధి కుక్కల వల్లనే. పట్టణాల్లో 60శాతం, గ్రామాల్లో 64శాతం వీధికుక్కల ద్వారా మరణాలు సంభవిస్తున్నాయని ఆ నివేదిక తేల్చింది. ఈ నేపథ్యంలో 2030 నాటికి రేబిస్‌ వ్యాధిని అంతమొందించడానికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్రాలను ఆదేశించారు. వీధి కుక్కలకు ఆపరేషన్లకు బదులు టీకాలు, ఇతర కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబిస్తే మెరుగైన ఫలితాలు లభిస్తాయని, దీని ద్వారా వీధికుక్కలను నియంత్రించొచ్చని అధ్యయనం తెలిపింది. ఈ కార్యాచరణ అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో అమలు కావాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుక్కల నియంత్రణ ఆరంభశూరత్వమే..

ఏప్రిల్‌ వరకు నగరంలోని 66 డివిజన్లలో 45 వేల వరకు కుక్కలున్నట్లు అధికారులు తేల్చగా.. ఇప్పుడు వాటి సంఖ్య పెరిగినట్లు చెబుతున్నారు. జంతు సంరక్షణ చట్టం ప్రకారం కుటుంబ నియంత్రణ, శస్త్రచికిత్స ద్వారా వీధి కుక్కల సంతానోత్పత్తిని నిలువరించేందుకు పాలకవర్గం నడుం బిగించింది. నగరంలో వాటిని పట్టుకునేందుకు మూడు బృందాలు, 12 మంది సిబ్బంది, మూడు వాహనాలు కేటాయించారు. ఐదున్నరేళ్లుగా గ్రేటర్‌ పరిధిలో వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 11,890 వేల కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. రోజూ సగటున 30 శునకాల చొప్పున నెలకు 900లకు కు.ని. చికిత్సలు చేస్తున్నారు. ఈ లెక్కన 66 డివిజన్లలో కుక్కలకు కు.ని. చికిత్స పూర్తవ్వాలంటే మరో ఐదేళ్ల వరకు సమయం పడుతుంది.

కుక్కకాటుకు రేబిస్‌ రాకుండా జాగ్రత్తలు

వీధికుక్కలు దాడిలో గాయపడినప్పుడు 0.3.7.14.28 రోజుల్లో మొత్తం ఐదు రోజుల పాటు వ్యాక్సిన్‌ ఇవ్వాలి.. గాయాన్ని యాంటీ సెప్టిక్‌ లోషన్‌, సబ్బుతో శుభ్రంగా కడగాలి. ఎలాంటి కుట్లు వేయొద్దు. కుక్కలకు తప్పని సరిగా లెప్టోస్పైరోసిస్‌ యాంటీ రేబిస్‌ టీకాలు చేయించాలి.

నేడు ప్రపంచ రేబిస్‌ దినోత్సవం...

ప్రపంచ రేబిస్‌ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌ 28న నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ప్రపంచ ఆరోగ్య సంస్థ, పాన్‌ అమెరికన్‌ హెల్త్‌ ఆర్గనైజేషన్‌, జంతు ఆరోగ్య ప్రపంచ సంస్థ, యూఎస్‌ సెంటర్స్‌ వంటి అంతర్జాతీయ మానవ, పశువైద్య ఆరోగ్య సంస్థలతో ఆమోదించబడింది. లూయి పాశ్చర్‌ జ్ఞాపకార్థం అతను మృతి చెందిన రోజైన సెప్టెంబర్‌ 28న ప్రతి సంవత్సరం ప్రపంచ రేబిస్‌ దినోత్సవం జరుగుతోంది. లూయిపాశ్చర్‌ మొదటి సమర్థవంతమైన రేబిస్‌ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు.

కుక్కలంటే భయమేస్తున్నది..



కుక్కల తోటి భయంగా ఉంది. గుంపులుగా తిరుగుతూ కనపడిన వారి మీదికి వస్తున్నాయి. ఆడోళ్లు, ముసలోళ్లు కుక్కలకు భయపడి బయటికి వస్తలేరు. పిల్లలు కనబడితే దాడి చేస్తున్నాయి. కుక్కల నుంచి మమ్మల్ని కాపాడండి.

- సరోజన, సమ్మయ్యనగర్‌, హనుమకొండ

ఇద్దరు, ముగ్గురుంటేనే బయటకు వెళ్తున్నం..



కుక్కల తోటి భయపడుతున్నం. ఒక్కరు వెళ్తే వెంటబడుతున్నాయి.. బెదిరిస్తే కూడా మీదికి వస్తున్నయ్‌... సాయంత్రం అయిందంటే ఆడోళ్లం బయటకే వస్తలేం. అవసరం ఉంటే ఇద్దరు, ముగ్గురం కలిసి బయటకు వెళ్లాల్సి వస్తోంది.

- రమ, పోచమ్మకుంట, హనుమకొండ

వీధికుక్కలను నియంత్రించాలి..



విద్యానగర్‌కాలనీ అంతర్గత రోడ్లపై వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. చేతిలో కర్రలేకుండా రోడ్డుపైకి రాలేకపోతున్నాం. రెండు నెలల్లో ఐదుగురిపై దాడి చేశాయి. అధికారులు స్పందించి వీధికుక్కలను నియంత్రించాలి.

- కీసరి లక్ష్మి, విద్యానగర్‌ కాలనీ

కచ్చితంగా వ్యాక్సిన్‌ వేయించాలి..



చిన్నారులపై వీధికుక్కలు దాడులకు పాల్పడుతున్న ఘటనలు నిత్యం జరుగుతున్నాయి. కుక్కలు దాడి చేయగానే నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే పీహెచ్‌సీ, లేదా ఎంజీఎం తరలించాలి. క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్‌ చేయించాలి. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

-మాళవిక, పశువైద్యురాలు,తూర్పుకోట

ఎస్‌ఏల బదిలీలకు.. సీనియార్టీ జాబితా వెల్లడి

- జిల్లాలో 218 ఎస్‌ఏ వెకెన్సీలు
- నేడు, రేపు వెబ్‌ ఆప్షన్లు
- ఈనెల 28న ఎస్జీటీల సర్వీస్‌బుక్స్‌ పరిశీలన



విద్యారణ్యపురి: హెచ్‌ఎంల బదిలీలు, పదోన్నతులు కూడా పూర్తయ్యాయి. దీంతో ఇక స్కూల్‌ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ జరగబోతుంది. ఇందుకు సంబంధించిన సీనియార్టీ జాబితాను విద్యాశాఖాధికారులు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో స్కూల్‌ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాపై బుధవారం డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలు స్వీకరించారు. అయితే స్కూల్‌ అసిస్టెంట్ల బదిలీలుకాని, పదోన్నతులకు కాని జిల్లాలోని జీరో స్ట్రెంత్‌ కలిగిన హైస్కూళ్లు, యూపీఎస్‌ల్లోని పోస్టులను వెకెన్సీలుగా చూపబోమని డీఈఓ అబ్దుల్‌హై వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో ఒక హైస్కూల్‌లో అసలే విద్యార్థులు లేరు. మరో మూడు,నాలుగు పాఠశాలల్లో ఆరు, ఏడు తరగతుల్లో అసలే విద్యార్థులు లేరని ఆయా పాఠశాలల్లోని వెకెన్సీలను బదిలీలకు గాని, పదోన్నతులకు గాని చూపబోమని డీఈఓ తెలిపారు. హనుమకొండ జిల్లాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి మొత్తం 218 వెకెన్సీలు ఉన్నాయి. బదిలీలు కోరుకునే స్కూల్‌అసిస్టెంట్లు ఈనెల 28, 29 తేదీల్లో వెబ్‌ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సింటుంది. ఈనెల 30న ఎడిట్‌ ఆప్షన్‌ కూడా ఉంటుంది.ఆ తరువాత బదిలీల కేటాయింపులు జరుగుతాయి.

డీఈడీ కలిగిన టీచర్లకు నేడు సర్వీస్‌ బుక్స్‌ పరిశీలన

హనుమకొండ జిల్లాలో పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు సంబంధించి డీఈడీ కలిగిన ఎస్జీటీల సర్వీస్‌బుక్స్‌ను ఈనెల 28న డీఈఓ కార్యాలయంలో పరిశీలన చేయనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు. డీఈడీ కలిగిన ఎస్జీటీలు ఉదయం 11గంటలకు డీఈఓ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురి మృతి

వేర్వేరు కారణాలతో మంగళ, బుధవారాల్లో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఐదుగురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

వంగపహాడ్‌లో జ్వరంతో విద్యార్థిని..

హసన్‌పర్తి: జ్వరంతో పదో తరగతి విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం రాత్రి నగరంలోని 2 డివిజన్‌ వంగపహాడ్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సిలువేరు సౌమ్య(15) ఓ ప్రైవేట్‌ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. అయితే రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో చికిత్స నిమిత్తం మంగళవారం ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. విద్యార్థిని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, విద్యార్థి మృతితో పాఠశాలకు సెలవు ప్రకటించారు.



సౌమ్య (ఫైల్‌)

జ్వరం బారిన ప్రజలు..

ఇదిలా ఉండగా, గ్రామంలో విషజ్వరాలు తీవ్రంగా ప్రబలినట్లు స్థానికులు తెలిపారు. రెండు,మూడు రోజుల పాటు జ్వరం తగ్గడం లేదన్నారు. జ్వరం బారిన పడిన వారిలో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. మురుగు కాల్వలు, చెత్తను శుభ్రం చేసిన దాఖలాలు లేవన్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చికిత్స పొందుతున్న కౌలు రైతు..

ఎల్కతుర్తి: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగిన ఓ కౌలు రైతు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దాట్ల ప్రవీణ్‌(38) తనకున్న 20గుంటల భూమితో పాటు మరో ఎకరం 20గుంటలు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల తన భూమిలో వ్యవసాయ బావి తవ్వించగా నీరు పడలేదు. దీంతో కొంత అప్పు అయింది. తిరిగి మళ్లీ వేరే దగ్గర బావి తవ్వించగా అందులో కూడా నీరుపడలేదు. అప్పు మరింత పెరిగింది. దీంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలో ఈనెల 25న పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరకున్నాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మొగిళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు వెల్లడించారు.



ప్రవీణ్‌ మృతదేహం

కారు ప్రమాద ఘటనలో మరో విద్యార్థి..

కాజీపేట అర్బన్‌ : నిట్‌ వరంగల్‌ సివిల్‌ విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఈనెల 20వ తేదీన కారులో లక్నవరం బయలుదేరి 21వ తేదీ తెల్లవారుజామున ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలో ప్రమాదానికి గురైన ఘటన విధితమే. ఘటనా స్థలిలోనే విద్యార్థి నిస్సి మృతి చెందగా మిగతా ఐదుగురులో నలుగురు హనుమకొండలోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. తీవ్రగాయాలపాలైన హైదరాబాద్‌కు చెందిన అల్లోల సాయిచరణ్‌(19) మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

నీటి గుంతలో పడి మహిళ..

గణపురం : నీటి గుంతలో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని బుద్ధారంలో జరిగింది. గ్రామానికి చెందిన చింత లచ్చమ్మ (50) పశువుల కాపరిగా పని చేస్తోంది. ఈ క్రమంలో రోజుమాదిరిగానే పశువులను గ్రామ సమీపంలోని సోమిదేవికుంట దగ్గర మేపుతోంది. ఈ క్రమంలో మట్టి కోసం తవ్విన నీటి గుంతలో పడి మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో మరో మహిళ..

నర్సంపేట రూరల్‌ : పాముకాటుతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన నర్సంపేట మండలం మహేశ్వరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బండి మానస (30) నర్సంపేట మిషన్‌భగీరథ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీన సాయంత్రం ఇంట్లో పని చేస్తున్న క్రమంలో మానసను పాము కాటు వేసింది. దీంతో వెంటనే వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.



మానస (ఫైల్‌)

మరింత వ్యాపారాభివృద్ధి సాధించాలి

- రూ.3 వేల కోట్ల లక్ష్యంగా ముందుకెళ్లాలి
- రుణాల సద్వినియోగం బాగుంది
- నాబార్డ్‌ జనరల్‌ మేనేజర్‌ హర గోపాల్‌



మాట్లాడుతున్న నాబార్డ్‌ జీఎం హరగోపాల్‌

హన్మకొండ: వరంగల్‌ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వ్యాపారాభివృద్ధి బాగుందని, మరింత అభివృద్ధి సాధించాలని నాబార్డ్‌ జనరల్‌ మేనేజర్‌ హర గోపాల్‌ అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్‌ డీసీసీబీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకు వ్యాపారాలు, రుణ సేకరణ, రుణ వితరణ, నిధుల వినియోగం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రగతిని సమీక్షించారు. నాబార్డ్‌ ద్వారా తీసుకున్న రూ.22 కోట్లు వినియోగించిన తీరును అభినందించారు. ఈ నిధులతో రూ.7 గోదాములు నిర్మించిన తీరు, ఇతర పనులు పురోగతిలో ఉండడాన్ని ప్రశంసించారు. నిధులు సద్వినియోగం చేసుకుంటున్న తీరు బాగుందని, మరింత సాయం అందించేందుకు నాబార్డ్‌ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం డీసీసీబీ వ్యాపారం రూ.17 వేల కోట్లు ఉందని, దీనిని మరింత వృద్ధి చేయాలని, రూ.3 వేల కోట్ల టర్నోవర్‌ లక్ష్యంగా నిర్ణయించుకుని ముందుకెళ్లాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి తీసుకున్న చర్యలు బాగున్నాయని అభినందించారు. రైతులకు రుణాలు ఇవ్వడం, రికవరీ తీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. వరంగల్‌ డీసీసీబీ అన్ని విభాగాలో ప్రగతి సాధించిందని అభినందించారు. సమావేశంలో నాబార్డ్‌ డీడీఎంలు చంద్రశేఖర్‌, రవి, డీసీసీబీ సీఈఓ చింతలపూడి చిన్నారావు, డీజీఎంలు, ఏజీఎంలు, మేనేజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమ బల్లువాకు అరుదైన అవకాశం..

- నూతన పార్లమెంట్‌ భవనంలో జరిగే కార్యక్రమానికి ఆహ్వానం



ప్రతిమ బల్లువా

వరంగల్‌: నూతన పార్లమెంట్‌ భవనంలో గొప్ప నాయకులకు అక్టోబర్‌ 2వ తేదీన నిర్వహించే శ్రద్ధాంజలి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వరంగల్‌ రామన్నపేటకు చెందిన ప్రతిమ బల్లువాకు లభించింది. కేంద్ర ప్రభుత్వ యువత వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన ప్రతినిధులు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపిక కోసం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో మొదటి స్థానం పొందిన 25 మందిని ఎంపిక చేసి అక్టోబర్‌ 2వ తేదీన నూతన పార్లమెంట్‌ భవనంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో ప్రతిమ బల్లువా మొదటి స్థానంలో నిలిచి ఈ అరుదైన అవకాశం దక్కించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో కూడా ప్రతిమ బల్లువా శ్రీహరికోటలోని ఇస్రోలో జరిగిన పోటీల్లో తెలంగాణ తరుపున పాల్గొని విజేతగా నిలిచింది. జీ 20 సదస్సులో భాగంగా నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి తెలంగాణ రాజ్‌భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో పాల్గొంది. ప్రతిమ వరంగల్‌లోని పద్మావతి డిగ్రీ కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశారు. ప్రతిమ బల్లువా తండ్రి బి.విష్ణుకుమార్‌ నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా, తల్లి కవిత గంగదేవిపల్లిలోని భారతి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఘనంగా శ్రీచక్రస్నానం



కోనేటిలో ఉత్తిష్ట గణపతికి అవబృథస్నానం చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్‌: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల ఆలయంలోని ప్రాచీన కోనేటిలో బుధవారం ఉత్తిష్ట గణపతికి శ్రీచక్రస్నానాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితుడు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్‌ మూలమహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. గంగు ఉపేంద్రశర్మ ప్రాచీన కోనేటిలో ఉత్తిష్ట గణపతికి జలాధివాసం నిర్వహించారు. గౌరీగణపతిని నిమజ్జనం చేశారు. అనంతరం ఉత్తిష్ట గణపతిని తిరిగి దేవాలయంలో నిత్యపూజల కోసం రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రతిష్ఠించారు. పూజల్లో ప్రముఖ సినీనటుడు నాజర్‌ స్వామి పాల్గొన్నారు. దాతలు కంజుల మహేశ్‌, డాక్టర్‌ పద్మావతి, వడ్డే ప్రకాశ్‌, వెన్నిశెట్టి సుబ్రమణ్యం, మహేంద్రకపూర్‌, వద్దిరాజు వెంకటేశ్వర్లు, గోపీనాథ్‌, పులి రజనీకాంత్‌, శంకరనారాయణ, రాజు, చంద్రశేఖర్‌, గోపాల్‌రావు పాల్గొన్నారు. ఆలయ ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు.

ఘనంగా నిమజ్జన ఊరేగింపు..

సాయంత్రం 6 గంటలకు గణపతి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ప్రారంభమైంది. రాయపుర, బ్రాహ్మణవాడ, మచిలీబజార్‌, రాజ్‌పుత్‌వాడ, హనుమకొండ చౌరస్తా, విజయటాకీస్‌రోడ్‌, లష్కర్‌బజార్‌, అశోకాసెంటర్‌, ఎస్పీ కార్యాలయం మీదుగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు పులిహోర ప్రసాదాలు పంచిపెట్టారు. సిద్ధేశ్వరుడి గుండంలో నిమజ్జనం చేశారు.

ఖిలాషాపూర్‌లో ఘర్షణ..

- ఐదుగురిపై కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌లో వినాయకుడి మండపం వద్ద జరిగిన ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన ఎడమ గౌతమ్‌ రెండు రోజుల క్రితం ఖిలాషాపూర్‌లోని తన బంధువుల ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి అక్కడి మండపం వద్ద స్థానిక యువకులతో కలిసి నృత్యం చేశారు. ఆ సమయంలో తగాదా చోటు చేసుకుంది. ఈ ఘటనపై పెద్దమనుషుల సమక్షంలో బుధవారం పంచాయితీ నిర్వహించగా గౌతమ్‌కు అనుకూలంగా స్థానికుడు జిట్ట రాజు సాక్ష్యం చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన స్థానిక యువకులు తమకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతావా అంటూ జిట్ట రాజుపై మంగు రామకృష్ణ, బాల్నె ప్రణీత్‌, గంధమల్ల జగన్‌, పెండ్యాల రాజేష్‌, శాగ నితిన్‌.. పెద్ద మనుషుల సమక్షంలోనే దాడి చేశారు. దీనిపై రాజు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిమజ్జనంలో విషాదం..

- చెరువులో మునిగి వ్యక్తి మృతి
- సింగారం గ్రామంలో ఘటన



సారయ్య మృతదేహాన్ని వెలికితీస్తున్న జీడబ్ల్యూఎంసీ సిబ్బంది

ఐనవోలు: గణనాథుడి నిమజ్జనంలో విషాదం చోటు చేసుకుంది. చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సింగారంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సురేందర్‌ తన ఇంట్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు పసరగొండ కరుణాకర్‌తో కలిసి గ్రామ ఊరచెరువు వద్దకు చేరుకున్నాడు. ఈ సమయంలో అక్కడే ఉన్న అయిత సారయ్య(40) ఆ వినాయక విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేసి కట్టపైకి ఎక్కాడు. ఈ క్రమంలో సారయ్య బావమరిది కలకోట్ల చిరంజీవి అదే చెరువులో ఓ పక్కన ఈత కొడుతున్నాడు. దీంతో మరోసారి సారయ్య చెరువులోకి దిగాడు. కొద్దిసేపటికి చిరంజీవి ఒక్కడే చెరువు నుంచి బయటకు వచ్చాడు. సారయ్య మాత్రం నీటిలో మునిగిపోయాడు. చెరువు కట్టపైనే ఉన్న సురేందర్‌, కరుణాకర్‌.. స్థానికులకు సమాచారం అందించారు. దీంతో జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సారయ్య మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. సారయ్య మృతిపై గ్రామంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నవీన్‌కుమార్‌ తెలిపారు.